క్లుప్తంగా

ఈ-పాస్ యంత్రాలతో ఎరువులు అమ్మకాలు చేయాలి

ఏడీఏ రవిబాబు

శావల్యాపురం: ఖరీఫ్ సీజను ప్రారంభం నుంచి ఎరువుల డీలర్లు ఈపాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని ఏడీఏ బోయపాటి రవిబాబు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు పట్టాదారుపాసు పుస్తకానికి ఆధార్ నంబరు అనుసంధానం చేయించాలన్నారు. భూసార పరీక్ష పత్రాల విశ్లేషణ ఫలితాల ఆధారంగా రైతుల ఎరువులు వాడుకోవాలన్నారు. రైతులు అనవసరంగా రసాయనిక ఎరువులను ఎక్కువ మోతాదులో వాడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల పెట్టుబడులు పెరుగుతాయన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు పురుగు మందులను వాడినట్లయితే తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించ వచ్చునన్నారు. ఎరువులు కొరత లేదని, ఎరువులు అమ్మే డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా ఎరువులు అమ్మకాలను డీలర్లు చేయాలన్నారు.

మహేష్‌కు తెలుగు వెలుగు పురస్కారం



నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన వేమన పద్య సాహితీవేత్త ఎస్.మహేశ్వరరావును చెన్నైకు చెందిన తెలుగు వెలుగు సంక్షేమ సంఘం తెలుగు వెలుగు పురస్కారంతో సత్కరించింది. చెన్నైలో ఈనెల 25వతేదిన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధూం ధాం తెలుగు భాషా సంబరాల్లో భాగంగా పురస్కారం అందచేసినట్టు మహేశ్వరరావు తెలిపారు. వేమన పద్య సాహిత్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తున్న మహేష్‌కు పురస్కారం లభించటం పట్ల పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

పెసరలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: పెసర పంటలో పల్లాకు, బొబ్బర తెగులు, మారుకా మచ్చల పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని ఇక్కుర్రు గ్రామంలోని పెసర పంటను నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మతో కలిసి సోమవారం పరిశీలించారు. పెసర పంటలో కలుపు పంట గిడసబారడం గమనించారు. సాగు నీరు వస్తుండటంతో పంటను పచ్చిరొట్ట ఎరువుగా దున్నతామని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పెసర పంటలో పల్లాకు, బొబ్బర తెగులును గుర్తించి వాటి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. తెల్లదోమ ద్వారా పల్లాకు తెగులు, పేను బంక ద్వారా బొబ్బర తెగులు వ్యాపిస్తుందని తెలిపారు. వీటి నివారణకు తెగులు సోకిన మొక్కలను తొలగించి ప్రొఫెనోఫాస్ 300 మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 40 గ్రాములు లేదా థయోమెథాక్సమ్ 40 గ్రాములను ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు పావని, ఏఈవో బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలను జయప్రదం చేయాలి



చిలకలూరిపేట: కార్మిక హక్కుల పరిరక్షణ కోసం విశాఖపట్నంలో సెప్టెంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు నిర్వహిస్తున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులతో కలసి జాతీయ సమ్మేళనాల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేశారని చెప్పారు. దేశసంపద కొందరు కార్పొరేట్ల చేతుల్లోనే ఉందన్నారు. కష్టజీవులు సంపదను సృష్టిస్తే, కార్పొరేట్ శక్తులు లక్షల కోట్లు కూడబెట్టుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిన బీజేపీ ప్రభుత్వం వాటిని వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, తాపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసా సాంబయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తుబాటి సుభాని, వివిధ సంఘాల నాయకులు మొహమ్మద్ షరీఫ్, నాయుడు శివ కుమార్, ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్ సింగ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐఎంఏ స్పందించాలి



డాక్టర్లపై ఏదైనా దాడిజరిగినా, వారి హాస్పిటళ్లపై దౌర్జన్యానికి వచ్చినా వెంటనే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందించాలి. వారొక కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. ఆ డాక్టర్‌ది తప్పుందా లేక ఎదుటి వ్యక్తుల తప్పా అనేది నిర్ధారించాలి. చట్టాలు బలంగా ఉండి అమలుతీరు వేగంగా ఉంటే డాక్టర్లపై దాడులు జరగవు. కోలకతా సంఘటనలో ఉదయం 11 గంటల వరకు జరిగిన దారుణం బయటకు రాలేదు.

–డాక్టర్ ఎస్.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నరాల స్పెషలిస్టు, నరసరావుపేట

వైద్యులను గౌరవించటం నేర్చుకోవాలి



వైద్యులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. ఆ గౌరవం నానాటికీ తగ్గిపోతుండటం వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయి. డాక్టర్లకు రక్షణగా పటిష్టమైన చట్టాలు ఉంటే బాగుంటుంది. ప్రభుత్వ హాస్పిటళ్లు, మెడికల్ కళాశాలల్లో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో మాకు తెలుసు. కోలకతా సంఘటన తల్చుకుంటే బాధ అనిపిస్తుంది. మహిళలు ఎవరైనా సరే తగిన రక్షణ కల్పించాలి. వారిని తగిన గౌరవం ఇవ్వాలి.

–డాక్టర్ పేరం రాజనందరెడ్డి, ఎండీ జనరల్, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు, నరసరావుపేట

ముకుందా..ముకుందా కృష్ణా!!



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధ గోవిందులు



వినుకొండ వివేకానంద పాఠశాలలో ఫ్యాన్సీడ్రస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గణపవరంలో ప్రత్యేక అలంకరణలో సంతాన వేణుగోపాలస్వామి



గణపవరం పడమర బజారులో ఉట్టి కొట్టే పోటీల్లో పాల్గొన్న యువత



నరసరావుపేటలో శ్రీకృష్ణుడు వేషధారణలో విద్యార్థిని

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమీ వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): శ్రీకృష్ణ జన్మాష్టమీ పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలు, పాఠశాలల్లో ప్రత్యేకపూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెల్లటూరు రోడ్డులోని, శ్రీకృష్ణుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పలు దేవాలయాలల్లో పూజలు చేశారు. పట్టణంలోని గీతాంజలీ, వివేకానంద, పాఠశాలతోపాటు పలుపాఠశాలల్లో, చిన్నారులు, శ్రీకృష్ణుడు, గొల్లభామ వేషధారణలో ప్రదర్శనలు, ఫ్యాన్సీడ్రస్ పోటీలు నిర్వహించారు. జన్మాష్టమీ పర్వదినం విశేషాలను తెలియజేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఉదయం నుంచే వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న గీతా మందిరంలో రుక్మిణి సత్యభామా సమేత శ్రీకృష్ణుడికి పంచామృత సుగంధ ద్రవ్య అభిషేక పూజలు నిర్వహించారు. పంచహారతుల అనంతరం స్వామివారి తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య కల్యాణ మండప ప్రాంగణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, మెయిన్ బజార్‌లోని రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గణపవరంలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో పూజారి ద్వాదశి కేశవాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం శాంతి కల్యాణం నిర్వహించారు. పడమర బజారులోని కృష్ణాలయంలో, సాతులూరు రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గణపవరం కోదండ రామాలయంలో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా పూజారి దర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఎదుట ఉట్టికొట్టే పోటీలు జరిగాయి. విజేతగా నిలిచిన యువకుడికి రాధాకృష్ణుల ప్రతిమను గ్రామానికి చెందిన కొండెబోయిన వెంకటగోపీ అందజేశారు. భక్తులకు ప్రసాద వితరణ గావించారు.



శావల్యాపురంలో శ్రీకృష్ణుడు వేషధారణలో చిన్నారులు

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి, శానంపూడి, వేల్పూరు, శావల్యాపురం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో విగ్రహాలను మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగింపు చేశారు. ప్రతి ఏటా శ్రీకృష్ణుడు జన్మదిన వేడుకలు వాడవాడలా జరుపుకోవటం పాటు గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాలు కోలాహలంగా యువకులు ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించారు.

కుల మతాలకు అతీతంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణుడు గొల్లభామా అలంకరణలతో చిన్నారుల ముద్దు ముద్దులు ఒలిగే చిట్టి అడుగులు మధ్య వేడుకలు అందరు నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీనిదానంపాటి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా కేకు కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉట్టే కొట్టే కార్యక్రమం యువకులు నిర్వహించారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట రూరల్: పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరయ్యారు. శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా రంగోలి, కోలాటం పోటీలను నిర్వహించారు.

ఉట్టికొట్టే పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్ భూషణ్, డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



నరసరావుపేట ఏఎంరెడ్డి కళాశాలలో కోలాట ప్రదర్శనలో విద్యార్థినులు



నరసరావుపేట ఏఎంరెడ్డి కళాశాలలో రంగోలి పోటీల్లో విద్యార్థినులు



శావల్యాపురంలో శ్రీకృష్ణుడు జన్మదిన కేకును సిద్ధం చేసిన పెద్దలు, యువకులు

నరసరావుపేట ఇస్కాన్‌లో..

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల మూర్తులకు శుభమంగళ హారతి సమర్పించి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జమిందార్ రామకృష్ణ కొండలరావు బహద్దూర్, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మూలవరులను దర్శించుకొని పూజలు జరిపారు. జన్మాష్టమి సందర్భంగా ఆలయంలో భాగవత ప్రవచనం, మహా హరినామ సంకీర్తనలు చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం మధ్య ఉట్లోత్సవం, రాత్రి ఉత్సవమూర్తులకు మహాశంఖాభిషేకం, మహారాజభోగం నివేదన సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అందరికీ ఆదర్శం మదర్‌థెరిస్సా జీవితం

- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే చదలవాడ
- ఎల్‌బీ మార్కెట్ వద్ద నివాళులు అర్పించిన జనసేన, మెగాస్టార్ అభిమానులు



ఎల్‌బీ మార్కెట్ వద్ద మదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నరసరావుపేట: భారతరత్న సెయింట్ మదర్ థెరిస్సా జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. స్థానిక పల్నాడు రోడ్డులో గల సెయింట్ మదర్ థెరిస్సా విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సెయింట్ మదర్ థెరిస్సా 114వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అరవిందబాబు హాజరై విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుష్టు రోగులకు వైద్య చికిత్సను అందిస్తూ మురికి వాడలలో నివసించే నిరుపేదలకు విద్య, వైద్యం అందిస్తూ ప్రేమే లక్ష్యం, సేవే మార్గమని నినదిస్తూ ముందుకు సాగిన గొప్ప త్యాగమూర్తి మదర్ థెరిస్సా అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నాగోతు ప్రకాష్ సుమారు 200మందికి అల్పాహారాన్ని అందించారు. సింగరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలోని 100మంది గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. పెద చెరువులోగల సెయింట్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి రవి వృద్ధాశ్రమంలో వయో వృద్ధులకు అన్నదానం చేశారు. తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్‌కుమార్, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు రాయల శ్రీనివాసరావు, మిట్టపల్లి రమేష్, గర్నెపూడి అలెగ్జాండర్, పాదర్తి ప్రసాద్, భాగవతుల లక్ష్మీనారాయణ (దుర్గాబాబు) టీడీపీ నాయకులు కొట్టాకిరణ్, క్రాంతికుమార్, గుత్తా అంకమ్మచౌదరి, జనసేన నాయకులు వీరవల్లి వంశీ, నార్ల మారుతిబాబు, పిడతల రమాదేవి, బీజేపీ నాయకులు అమ్మా జిలాని పాల్గొన్నారు.

లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో...

స్థానిక ఎల్‌బీ మార్కెట్ సెంటర్‌లోని మదర్ థెరిస్సా విగ్రహానికి జనసేన, మెగాస్టార్ అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జనసేన నాయకులు అద్దేపల్లి ఆనంద్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా భావించి మిషనరీస్ అఫ్ చారిటీ అనే సంస్థ ద్వారా, పేదలకు, అనాథలకు ఉచిత విద్య, ఆహారం, రోగులకు ఉచితంగా మందులు ఇచ్చి వారి జీవితాలలో వెలుగులు నింపారన్నారు. విశిష్ట సేవలకు గుర్తింపుగా భారతరత్న పురస్కారాన్నిఅందుకొన్న మాతృమూర్తి మదర్ థెరిస్సా అన్నారు. శ్రీకాంత్ గుప్తా, కిష్టంశెట్టి గోవింద్, చెన్నుపల్లి సాంబశివరావు, మిరియాల వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా పబ్లిసిటీ ఫ్లెక్సీలు

- ఫ్లెక్సీతో సహా హైవేపై పడిపోయిన పోలీసు అవుట్‌పోస్ట్ !
- పట్టించుకోని అధికారులు



చిలకలూరిపేట ఎన్‌ఆర్టీ సెంటర్‌లో జాతీయ రహదారిపై పడిన ఫ్లెక్సీ, పోలీసు అవుట్‌పోస్ట్

చిలకలూరిపేట టౌన్: నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై ఫ్లెక్సీల ఏర్పాటు ప్రమాదభరితంగా మారింది. ఎన్‌ఆర్టీ సెంటర్‌లోని సర్కిల్ నుంచి గుంటూరు వైపు వెళ్లే రహదారి డివైడర్‌పై పోలీస్ అవుట్ పోస్ట్ ఉంది. దీనికి కొందరు వ్యక్తులు భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం గాలి వీయటంతో ఫ్లెక్సీతో సహా అవుట్‌పోస్ట్ జాతీయ రహదారిపై పడిపోయింది. అయితే ఎవరికీ పట్టనట్లు సాయంత్రం వరకూ దాన్ని తొలగించలేదు. వాహన చోదకులకు, భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై సర్కిల్ వద్ద ఫ్లెక్సీల ఏర్పాటు నిషేధం ఉన్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలు నియంత్రించాల్సిన పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. హైవేపై ఊళ్ళ డైరెక్షన్, దూరాన్ని సూచించే సైన్‌బోర్డులను సైతం ఫ్లెక్సీలతో కప్పేస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రమాణికులకు గమ్యస్థానానికి వెళ్లే దారి, దూరం తెలియక తీవ్ర ఇబ్బందులు తప్పటం లేదు. పోలీసు, హైవే అథారిటీ, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

కంకర లారీ కింద పడి వ్యక్తి మృతి

ఈపూరు: ప్రమాదవశాత్తు కంకర లారీ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొండ్రముట్ల సమీపంలోని నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచరులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు మేరకు వెంచరులో సిమెంటు పనులు చేస్తుండగా పనులు చేస్తున్న బొల్లాపల్లి మండలం చోలాయపాలెం గ్రామానికి చెందిన నేరేళ్ళ శ్రీనివాసరావు (40) కంకర లారీ వెనకకు తిప్పుతిండగా ప్రమాదవశాత్తు లారీ టైర్ల కింద పడి శరీరం గుర్తు పట్టని విధంగా నుజ్జునుజ్జయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఉమామహేశ్వరరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని చూసి చాటి కూలీల సైతం అయ్యో పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని పాఠశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అప్పాపురం గ్రామానికి చెందిన దుప్పలపూడి శివబాబు (43) సోమవారం వ్యక్తిగత పనులపై చిలకలూరిపేటకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా నరసరావుపేట ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి. అప్పాపురం వైపు మలుపు తిప్పే క్రమంలో ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొంది. తీవ్ర గాయాలైన శివ బాబును ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



క్రోసూరు. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఊటుకూరు వైద్య శిబిరంలో 66 మందికి వైద్య పరీక్షలు చేయగా ఆరుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారణ చేశారు. బయ్యవరంలో 36 మందికి వైద్య పరీక్షలు చేయగా ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారించి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాల్లో ఏఎన్‌ఎం లక్ష్మీ, బయ్యవరంలో ఏఎన్‌ఎం మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రేమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ శివుడు, ఆశ వర్కర్లు తదితరులున్నారు.

సహకరిస్తేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం

ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వేణు

నరసరావుపేట టౌన్: ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని నరసరావుపేట ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు అన్నారు. సోమవారం స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్ఐ వేణుతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణానికి గతంతో పోల్చుకుంటే బయట ప్రాంతాల నుంచి వచ్చే వారి సంఖ్య బాగా పెరిగిందన్నారు. కాలానికి అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయకపోవడం, ఆక్రమణలు తొలగించక పోవడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ముఖ్యంగా వాణిజ్య, వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉన్న మల్లమ్మ సెంటర్, పల్నాడు బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతుందన్నారు. దుకాణాలకు పార్కింగ్ ప్రదేశాలు లేకపోవటంతో వాహనదారులు నడిరోడ్లపై వాహనాలు నిలుపుతున్నారన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు రెండు షిఫ్టులుగా డ్యూటీలు వేసుకొని నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇస్సప్పాలెం వద్ద గల బైపాస్ రోడ్డు బాగా దెబ్బతినటంతో ఆ మార్గంలో రాకపోకలు జరపకుండా వాహనాలు పట్టణంలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. రోడ్ల మరమ్మతులు చేస్తే కొంతవరకు పట్టణానికి వచ్చే వాహనాలు తగ్గుతాయన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు నివేదిస్తామన్నారు. అదే విధంగా ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకుని బస్సులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే నిలిపే విధంగా చర్యలు చేపడతామన్నారు.

మినుము పైరుకు వైఎంవీ వైరస్



మినుము పైరును పరిశీలిస్తున్న డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మినుము పంటను డీడీఏ శివకుమారి సోమవారం పరిశీలించారు. మినుము పైరుకు వైఎంవీ వైరస్ సోకినట్లు గుర్తించారు. ఎల్లోవేయిన్ మొసాయిక్ వైరస్ నివారించేందుకు రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. తెగులు సోకిన మొక్కలను తొలగించాలన్నారు. వైరస్ నివారణకు పసుపురంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసెటమీప్రైడ్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వీరివెంట ఏడీఏ మస్తానమ్మ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.